జయజయ శంకర




హరహర శంకర

శాంకర సంవత్సరం 2533

సంపుటి : 3 సంచిక : 7,8,9

# శ్రీ కామకోటి వాణి

శ్రీ విశ్వావసునామ వైశాఖ - జ్యేష్ఠ మాసం, జూలై - సెప్టెంబర్ 2025



శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము




# 'నూతన ప్రాచీన సమన్వయం అనేది ఈరోజు దేశానికి అత్యవసరం'

మన భారతదేశానికి వేదాలే మార్గదర్శకాలు. మన నడత, ఆలోచన, ఆహారం లాంటి అనేక విషయాలను గురించి చెప్తూ భౌతికంగా, ఆధాత్మికంగా ఉన్నతిస్థితికి ఎదగడానికి వేదాలు ప్రమాణంగా ఉన్నాయి. ఆ వేదమార్గంలోనే మన వాళ్ళందరూ నడవటం వలన దేశం సుభిక్షింగా, ప్రశాంతంగా, సౌజన్యంగా ఉంది. ఎన్నో ఆపదలు, ఆటంకాలు, సంశయాలు, సంకటాలు, విఘ్నాలు, విక్షేపాలు, వ్యత్యాసాలు ఏమున్నా అందరూ ఐకమత్యంగా ఉన్నారు. మన ప్రాచీన హైందవధర్మము భగవంతుని ఆశీర్వచనము, పుణ్యము దొరికేటట్లుగా ఉంటుంది. ఈనాటి టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ దీనిని వ్యాప్తి చేయడానికి వాడాలి. అలా అనుకూలమైన, భద్రమైన విజ్ఞానాన్ని సరిగ్గా వాడకపోతే అదే భయానికి కారణం అవుతుంది. విద్య, అధికారం ఎవరి చేతిలో ఉండాలనేది కూడా ముఖ్యం. జ్ఞానం నిరుపయోగం, అనుపయోగం కాకుండా ఉండాలి. త్యాగరాజస్వామి కృతులు కూడా ఇంకెవరన్న వాడేసేలాగా ఉంది ప్రస్తుత పరిస్థితి. మన కళ, సంస్కృతి, సాహిత్యం అన్నీ బావుండాలంటే జాగృతి ఉండాలి. మనలో సమైక్యత, సంకల్పం, శ్రద్ధ ఉండాలి. ప్రస్తుతం భారతదేశం అనేక సౌకర్యాలతో పురోగతిలో ఉన్నది.

నదులు మనకు ప్రాణాధారము. నీరు అందాక మనం నదులు మర్చిపోకూడదు. వాటిని కూడా శుభ్రంగా పెట్టుకోవాలి. ఏది ఉత్పత్తి స్థానమో, ఎక్కడి నుండి మనకు చైతన్యం వచ్చిందో, సౌకర్యాలు ఎలా వచ్చాయో ఆ మార్గంలో నడవాలనే ఉద్దేశ్యము,

నిర్దేశ్యము చూసుకోవాలి. అది జ్ఞానం కావచ్చు, విద్య, వసతులు, కావచ్చు. మన భావితరాలు కూడా బావుండాలి. మన ములస్థానం ఏమిటో, హిందూమతము ఏమిటో ప్రపంచానికి తెలియజేయాలి. భారత సుప్రింకోర్టు కూడా హిందూమతమంటే ఒక జీవనవిధానము అని ప్రకటించింది.


మట్టి సారవంతంగా ఉండాలి. బుద్ధి తీక్షణంగా ఉండాలి. మనస్సు దయతో ఉండాలి. అప్పుడే కుటుంబం సౌహార్ద్రంగా ఉంటుంది. కక్షలు పెట్టుకోకూడదు. ఒక కుటుంబసభ్యుల మధ్యలో కోపాలు తాపాలు ఉన్నా ఏదో ఒక సమయంలో అందరూ కలిసి పనిచేయాలి. అలా సౌజన్యం, భక్తి, సదాచారం, శ్రద్ధ ఉంటేనే కుటుంబం నుండీ ప్రభుత్వం వరకు అన్నీ మంచిగా జరుగుతాయి. నైతికవిలువల (వాల్యూస్) వాల్యూమ్ పెద్దగా ఉంటుంది. మన నైతికవిలువలను గొప్పగా ఉంచడానికే ధర్మం ఉన్నది. 'ధర్మో విశ్వస్య జగత్ప్రతిష్ఠా' అని అంటారు.

ఒకప్పుడు భోజరాజు మంచి కవిత్వం వ్రాస్తే సన్మానం, సత్కారం చేసేవారు. గుర్తింపు కోసమని కాకుండా ఆ రోజుల్లో నిష్కామసేవ చేసేవారు. ఇప్పుడు విద్య నేర్చుకోవాలంటే అడ్మిషన్లు, ఫీజు అధికంగా ఉన్నాయి. ఒకప్పుడు గురుకులాల్లో వేదం, పురాణాలు, ఉపాకర్మ, సన్నాయి, చేతిపని, వడ్రంగం అన్నీ నేర్పబడేవి. విద్య నేర్పిస్తే జీవితానికి ఉపయోగపడుతుంది అంటే చదువుకున్నవారు ఇతరులకు నేర్పించేవారు. ధర్మదృష్టితో పెద్దవాళ్ళు చేసిన కర్మయోగం ఈ రోజుకీ భారతదేశాన్ని సుభిక్షంగా ఉంచుతోంది. మనం భగవద్గీత సందేశ సారం గ్రహించాలి. పూర్వం ఎంత పారాయణలు చేశారో తెలియదుగాని దాని సారాన్ని గ్రహించి, ఆచరించారు. అదే జీవితలక్ష్యంగా జీవించారు. మనవాళ్ళందరూ ఒక సిద్ధాంతం ప్రకారం పని చేశారు కనుక ఉన్నదాన్ని కాపాడగలిగాం. దాదాపు 1000 సంవత్సరాలు విదేశీ ఆక్రమణలు, విదేశ ప్రభావము, మనస్సులో ఆందోళన, ఎన్నో సంకటాలు ఉన్నా పుణ్యక్షేత్రాలన్నింటిని కాపాడుకోగలిగాం. పురాణాలను, సంస్కృతిని సాధ్యమైనంత వరకు కాపాడారు. తాళపత్రాలలో ఉన్నట్టు ఇప్పుడు అన్ని వేదాలు మనదగ్గిర లేవు. అధర్వవేదంలో కొన్ని శాఖలే ఉన్నాయి. ప్రస్తుతకాలంలో వేదాలను ఉపదేశంగా మాత్రమే పరిమితం చేశారు.

రామాయణంలో 'ప్రతిపత్ పాఠశీలస్య విద్యేవ తనుతాం గతా' అని ఉంటుంది. పాడ్యమి రోజు చదవకూడదు మరి కొన్ని రోజుల్లో చదవాలి వంటి నియమాలు ఉండేవి. అప్పుడు షడంగాలు, అంగాధ్యయనము, మూలాధ్యయనము అని అధ్యయన క్రమాలన్నీ



విశేషంగా ఉండేవి. వేదాధ్యయన పరంపర అనేది నియమనిష్ఠలతో ఉండేది. శ్రావణమాసంలో ఉపాకర్మ చేసి, హోమం చేసి ఆ ఎనర్జీతో మనస్సును, బుద్ధిని, సంకల్పాన్ని చార్జ్ చేసుకుంటారు. వేదాధ్యయనం చేయడానికి స్వధర్మాన్ని పాటించాలి. కొన్ని తరాలకి గాయత్రీ అనుష్ఠానం మధ్యలో విచ్ఛిత్తి వస్తే వేదాధ్యయనం చేసే అర్హత పోతుంది. అంత క్వాలిటీ, క్వాంటిటీని ఋషులు చెప్పిన నియమాలతో పాటించేవారు. అప్పలాయనము, ఆశ్వలాయనం, ఆపస్తంభం, బోధాయనం, ద్రాక్షాయనం అని ధర్మ సూత్రాలు,



శ్రౌత సూత్రాలు, గృహ్య సూత్రాలు ఉన్నాయి.

గర్భాష్టమ వయస్సులో ఉపనయనం చేయాలి. మనవాళ్ళు ఇప్పుడు చిన్నవయసులో ఉపనయనం చేయడం మంచివిషయం. అంది మంచి విషయం. విదేశాల నుండీ వచ్చి పిల్లలకు పంచశిఖలు పెట్టి వివిధ క్షేత్రాలలో, అగ్రహారాలలో వడుగులు చేస్తున్నారు. ఇలా జాగృతి, శ్రద్ధ పెరుగుతున్నది. సౌకర్యం పెరిగేకొద్దీ మన ధర్మం, ఆచారం పెరగాలి.

ఇదివరలో పెద్ద కుటుంబాలు ఉండేవి. పదిమంది పిల్లలు ఉండేవారు. ప్రజలకు బాధ్యత ఉన్నది కనుక బరువును సహించి బైట పడ్డారు. ఈ బాధ్యత బరువులను నిర్వహించే సహనశక్తి మనకు పరంపరలోనే ఉన్నది. ఎన్నో వ్యక్తిగతమైన, కుటుంబపరమైన, సాంఘీకపరమైన, కష్టాలు పడ్డారు. ఇప్పుడు అందరూ సౌఖ్యంగా ఉన్నారు కనుక ధర్మాన్ని ఇంకా ఎక్కువ ఆచరించాలి.

మహాస్వామివారు 'కన్యకాదానం' అని ట్రస్టు పెట్టారు. పెళ్ళి సకాలంలో చేయండి, ఆడంబరంగా చేయకండి అని చెప్పేవారు. స్వామివారికి ముందు ఉన్న 'సుదర్శన మహాదేవేంద్ర సరస్వతీ' స్వామివారు ఆంధ్రదేశంలో శ్రీకాళహస్తి, విజయవాడ, విశాఖపట్టణం, శ్రీకాకుళం, జగన్నాథపురాలలో విస్తృతంగా పర్యటించారు. వారియొక్క అధిష్ఠానం రామేశ్వరం వెళ్ళే దారిలో ఇళయాత్తంగుడి అనే ఊరిలో ఉంది. ఆ కాలంలోనే ఆయన పంచాంగ సభలు నడిపారు. దృక్‌సిద్ధాంతం అనే విషయాన్ని ప్రచారంలోకి తీసుకువచ్చారు. అప్పట్లో సమాజంలో ఉన్న కన్యాశుల్కాన్ని అమలు చేయకూడదు అని చెప్పారు. ఆ ఇళయాత్తం గుడిలోనే మహాస్వామివారు జయేంద్రసరస్వతీ స్వామివారికి తర్కశాస్త్రం చెప్పించారు. అప్పుడు మాండలీక వెంకటేశ్వరశాస్త్రిగారు భాగవత గ్రంథాన్ని తెలుగులో చెప్పడం జరిగింది.

సమాజంలో ఏ విషయంలో ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి అనే విషయాన్ని మాకు స్వామివారు చెప్పడం, సమాజంలో మంచిమార్పు తీసుకురావడం జరుగుతున్నాయి. అప్పుడు స్వామివారు కన్నికాదానం, వేదరక్షణనిధి ట్రస్టులు పెడితే, ఇప్పుడు ధర్మప్రచార పరిషత్ వారు తమవంతు ప్రచారం చేస్తున్నారు. 1967, 68, 69లలో కాళహస్తిలో, విజయవాడలో, సికింద్రాబాద్‌లో 'వ్యాసభారత శిల్పకళా సదస్సు' జరిపారు. అందులో పాంచరాత్రము, వైఖానసము, బుర్రకథ, అష్టావధానము, డోలు, సంగీతము మొదలైన విద్యలను కాపాడాలి అని పిలుపునిచ్చారు. ఆ సమయంలో పి.వి.నరసింహారావుగారు (ఎడ్యుకేషన్ మినిస్టరు) కాళహస్తికి వచ్చి స్వామివారిని కలుసుకున్నారు. అలా ఒక ఆసక్తి, జాగృతి, ప్రోత్సాహం కలిగిన వాతావరణం సృష్టించారు. వేదాన్ని కాపాడితే అది ప్రపంచాన్ని రక్షిస్తుందని, వేదవిద్య గురించి కూడా బాగా ప్రచారం చేశారు. జయేంద్రసరస్వతీస్వామివారు 'వేదరక్షణం – లోకరక్షణం' అని అన్నారు. ధర్మరక్షణకు, లోకరక్షణకు తెలివి, ధైర్యం, నమ్మకం ఉండాలి అని ప్రజలకు ఉద్బోధలు చేశారు.

**'ఉద్యమః కార్యసాధకః'**

**'ఉద్యోగినం పురుషసింహం ఉపైతి లక్ష్మీః'**

**'కర్మణ్యేవ అధికారస్తే మా ఫలేషు కదాచన'** – భగవద్గీత

మన పూర్వీకులు ఫలితాన్ని ఆశించకుండా కర్తవ్యాన్ని నిర్వహించారు కాబట్టే ఈనాడు మన వేదవిద్య, సంస్కృతి, ఆచారవ్యవహారాలు, కుటుంబవ్యవస్థ ఇంకా బలీయంగా ఉన్నాయి. మన కర్తవ్యం, ధర్మం కుటుంబానికి మేలు చేయాలి. అప్పుడూ మంథర, కైకేయి పాత్రలు ఉన్నాయి. కానీ కలహాల మధ్యలో కూడా పనులు జరిగినాయి. దానికి స్వధర్మం అనే నిష్ఠ కారణం. ఈ దేశంలో సంస్కృతిని కాపాడటం ప్రతి ఒక్కరికి బాధ్యత.

ఇప్పుడు ప్రతి ఇంట్లో ఒక మార్పు చూస్తున్నాం. తల్లిదండ్రుల మాట చదువు పూర్తయ్యే వరకు వింటారు తరువాత స్వతంత్రుల మంటారు. ఇప్పటి పరిస్థితులు మీకు తెలియదు, గ్లోబలైజేషన్ అంటారు. వివాహవ్యవస్థలో విడాకుల సంఖ్య పెరిగింది. ఆ సమయంలో ఎవరి మాట ఎవరు వినాలి అనేది ఒక భయంకర




స్థితి. అవన్నీ చూసినప్పుడు నవగ్రహానుకూల్యం ఉండాలి అనిపిస్తుంది. దానికి ప్రార్థన, ప్రయత్నం రెండూ అవసరం. కుటుంబసఖ్యత గురించి సమాజంలో అందరికీ భయం మొదలైంది. భారతదేశంలో కుటుంబమే మన బలం. అదే వటవృక్షం లాంటిది. భారతదేశ సంస్కృతికి 'టానిక్' లాంటిది. కుటుంబబలంతోనే మనిషి సమాజసేవ చేయగలుగుతారు. అందుకనే కుటుంబంలో ప్రీతి, శ్రద్ధ, దైత్వం, నమ్మకం అన్నీ ఉండాలి. కుటుంబసఖ్యతకి దైవశక్తితోపాటు అనుభవం కలిగిన పెద్దల సలహాలు అవసరం.

సమాజానికి సేవ చేయాలంటే ప్రతి గ్రామంలో రెండు మూడు బ్రాహ్మణ కుటుంబాలైనా ఉండాలి. వాళ్ళు మంత్రశక్తిని, మందిరాలలో శక్తిని కాపాడాలి. భారతదేశం యొక్క తత్త్వాన్ని కాపాడే కర్తవ్యం, అవకాశం బ్రాహ్మణులకి ఉంది గనుక స్వధర్మానుష్ఠాన విషయంలో సరిగ్గా ఉండాలి. 'ప్రవాసీ భారత్ నుండీ నివాసీ భారత్' అనే దాని కోసం ప్రయత్నం చేయాలి. అందరూ సుభిక్షంగా, ఆరోగ్యంగా ఉండాలి అనేది మా ఆశయం. కాని దేశంలో వేద, శాస్త్ర పరంపర, బ్రాహ్మణ వంశం కూడా మంచిగా ఉండాలి. 'క్షేత్ర యాత్రా రతం వందే సద్గురుం చంద్రశేఖరం' యాత్రలు, క్షేత్ర దర్శనం ద్వారా మనస్సు పునీతమయ్యి ధర్మం పట్ల ఆసక్తిని పెంచుకోవచ్చు.

భావితరాలకు భారతదేశ చరిత్ర, వేదప్రాశస్త్యము, పురాణాలు విశదీకరించాలి. తరతరాలుగా మన పూర్వీకులు అనుసరించిన జీవనవిధానం, దానధర్మాలు లాంటి విషయాలు వాళ్ళకు చెప్పాలి. మనదేశంలో ఎన్నో సంఘర్షణలు ఉన్నా బ్రిటీష్, మొఘల్, పోర్చుగల్, డచ్ వాళ్ళతో ఎన్నో ఇబ్బందులు పడ్డా యాగాలు, అన్నదానం జరుగుతూనే ఉన్నాయి. రామాయణ మహాభారతాలు, జగద్గురువుల బోధనలు మొదలుకుని తోలుబొమ్మలాటలూ ద్వాదశి సమారాధనలు, వనభోజనాలు కూడా జరుగుతున్నాయి. ఆ ధర్మ, పుణ్య పరిపాకం చేత మళ్ళీ ధర్మ పునఃప్రతిష్ఠ జరిగింది. కాశీలో, రామేశ్వరంలో, భద్రాచలంలో, భూలోక వైకుంఠమైన తిరుపతిలో ఎన్నో ధార్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. బ్రాహ్మణుల యొక్క స్వధర్మం వేదశాస్త్ర సంరక్షణం. ఈ శాస్త్ర సందేశాలు మారుమూల గ్రామాల వరకు వరకు వెళ్ళి, కర్తవ్యనిష్ఠను ప్రేరణను కలిగించాలి. ఈ దేశంలో పేదా ధనిక తేడా లేకుండా అందరిలోను ధర్మం ఉంటుంది. దైవఅనుగ్రహం కలిగి, జన్మచరితార్థం చేసుకుంటూ, కృతకృత్యులు కావాలన్న చైతన్యం కలిగించాలి. ఈ పుణ్యం, చైతన్యం కలిగించేవి మందిరాలు. మందిరం ద్వారా బ్రాహ్మణులు ధర్మప్రచారం చేయడానికి బలంగా, ఆసక్తిగా ఉండి ప్రచారం చేసే స్థోమత, శక్తిసామర్థ్యాలు కలిగి ఉండాలి.

ఆరోజుల్లో మహాస్వామివారు నడిచి, పల్లకీలో యాత్రలు చేసేవారు. జయేంద్రస్వామివారు కొంతకాలం నడిచి, కొంతకాలం రిక్షా, ఏనుగులు, గుఱ్ఱాలు, తీసుకొని యాత్రలు చేశారు. ఇప్పుడు రోడ్లు, సౌకర్యాలు బాగున్నాయి కనుక సమాజం కోసం, శాస్త్రం, బ్రాహ్మణ్యం కోసం విస్తృత ప్రచారం జరిపించాలి. భవిష్యత్తులో వంశాల గురించి విస్తారంగా తెలియాలి. 'త్రివత్స' అనే కార్యక్రమంలో మగవాళ్ళందరికీ సంధ్యావందనము, సంస్కృతము నేర్పించే ఏర్పాట్లు చేశాము.



ఒంగోలు దగ్గర పొదిలిలో ఒక సిబిఎస్ఇ స్కూల్ ఏర్పాటు చేయించాము. అక్కడ పిల్లలకు ఆధునికవిద్యతో పాటు ఆధ్యాత్మికవిద్య నేర్పిస్తారు. సంధ్యావందనం, నిత్యాగ్నిహోత్రం చేయిస్తారు. ఆడపిల్లల కోసం సాంప్రదాయ పాఠశాలలు తిరుపతి, మహబూబ్‌నగర్, విజయవాడ, హైదరాబాద్‌లలో ఉన్నాయి. మహారాష్ట్ర, శ్రీరంగం ప్రక్కన జంబుకేశ్వరంలో క్రొత్తగా ప్రారంభం అయ్యాయి. ఇలా బ్రాహ్మణుల కోసం 'సమకాలీన ధర్మ విద్యా యోజన' ప్రచారం చేయాలి. సంగీత పాఠశాల, రామాయణ పాఠశాల ఉన్నాయి. యోగశాస్త్ర పాఠశాల ఏర్పాటు అవుతున్నది. అందుకని మనవాళ్ళు పల్లెలు, పట్నాలు అని కాకుండా సౌకర్యం ఉన్నచోట ధృడంగా ప్రచారం సాగించాలి.

**ప్రాణాగ్నిహోత్రం:**

ప్రాణాయస్వాహా, అపానాయస్వాహా, వ్యాయానస్వాహా, ఉదానాయస్వాహా, సమానాయస్వాహా – దీన్ని ప్రాణాగ్నిహోత్రం అంటారు. మహాస్వామివారి ఆరాధన జరిగేటప్పుడు జయేంద్ర స్వామివారు సామవేదం ఛాంద్యోగ ఉపనిషత్తు చెప్పి ఈ ప్రాణాగ్నిహోత్రాన్ని చదివించారు. ఇప్పుడు కూడ అలానే జరుగుతోంది. పంచభూతాల గురించి ఆ పారాయణ జరుగుతుంది. అందుకని 'ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానాది శుధ్యంతాం' అని చెప్తారు.

**విరజాహోమం:**

'విరజాహోమం' – మన చిన్నస్వామివారు సన్యాసదీక్ష ముందు ఆ హోమం చేసారు. 'విరజ' అంటే రజస్సులేని, దోషంలేని ఒక మంచి స్థితి. ఇలాంటి పరిస్థితి సమాజంలో ఉండాలి. భవిష్యత్తులో వేదశాస్త్రాన్ని అందరూ తెలుసుకోవాలి. అందరూ చతుర్వేదులు అవటం కష్టం. (కంచి పక్కన గ్రామం కలవై. అక్కడ మహాస్వామి వారి గురువు, పరమగురువు అధిష్ఠానాలు ఉన్నాయి. నాలుగువేదాలు చదువుకున్నవారు ఉండటం వల్ల పూర్వం కలవైని 'ఆదినారాయణ చతుర్వేది మంగళం అని పిలిచేవారు) ఎకనామిక్ మిడిల్ క్లాస్ వారికి ఆర్థికపరంగా ప్రత్యేక పథకాలు ఎలా అవసరమవుతాయో అలా ధర్మప్రచారంలో కూడా వేదిక్ మిడిల్ క్లాస్ అని మొదలుపెట్టవలసిన అవసరము ఉంది. చతుశ్శాస్త్ర పండితులు, చతుర్వేద పండితులు, స్వాధ్యాయ, భాస్కరాయ, ఘనపాఠీలు స్వధర్మంలో ఉంటూ, వాస్తవంలో ఏది సాధ్యమవుతుందో అది చేయాలి. గురువు దగ్గర మంత్రదీక్ష తీసుకోవడం, సంధ్యావందనం, సహస్రనామం కూడా ధర్మం పట్ల ఆసక్తితో చేయాలి. ఆదర్శంగా ఆచారములు పాటిస్తూ ఆనందకరమైన జీవితం ధ్యేయంగా పెట్టుకుని పని చేయాలి. బ్రాహ్మణులు అందరూ ఇలా ఉంటే సమాజానికి సందేశమౌతుంది. హిందూధర్మాన్ని కాపాడడానికి, మతమార్పిడి లేకుండా ఉండడానికి వీరు ముఖ్య కార్యకర్తలుగా ఉండాలి.

సాంప్రదాయ పాఠశాలలు, వేదపాఠశాలలతో పాటు కళానైపుణ్యం ఉండాలి. దానికోసం కార్వేటినగరంలో స్కూలు చదువుతో పాటు 150 మంది బాలురు, బాలికలు డోలు, సన్నాయి, నేర్చుకుంటున్నారు. సమాజములో స్కూలు చదువు లేకపోతే విలువ లేదు అనుకుంటారు. (డబ్బు, ఉద్యోగం, పెళ్ళి, కావాలంటే ఇంగ్లీషు డిగ్రీలు కావాలి కదా) అందుకే ఎకడెమిక్ చదువు నేర్పిస్తూ, మిగతావి నేర్పిస్తున్నాము. కార్వేటినగరంలో కుండలు, మట్టిపాత్రలు, ప్రమిదలు చేయడానికి కుంభకార పాఠశాల ప్రారంభించాము. చిత్తూరు జిల్లా అటవీపల్లి అనే గ్రామంలో గోవుల సంరక్షణ కోసం 'భారతీయ గో విజ్ఞాన పాఠశాల' ప్రారంభించాము. మన హిందూధర్మానికి సంబంధించిన శిల్పం, నాట్యం, ఇతర కళలు నేర్చుకోవాలి. మనం కుంభకర్ణుడిలా ఉంటే కష్టం, కర్ణుడిలా ఉ



ండాలి, కుంభాలు ఉండాలి. రెండు సంవత్సరాల క్రితం ఆంధ్రదేశం వెళ్ళినప్పుడు అనేక సమాజసంఘాలకు వెళ్ళి అక్కడ స్వయంవర పార్వతీహోమం చేయించాము. సమాజంలో అందరికీ అందరూ అవసరం. వేదాలు, వ్యవసాయం, పరిశ్రమలు, సైన్స్, సంగీతం అన్నీ అవసరం. అందుకని నూతన ప్రాచీన సమన్వయం అనేది జరగాలి. పూర్వము వేదము, శాస్త్రము, నదీస్నానము, సంధ్యావందనము, యజ్ఞయాగాదులు అన్నీ మంచిగా జరిగాయి. మధ్యలో కొంత విముఖత ఏర్పడి, చట్టానికి శాస్త్రానికి అవగాహన లేక తేడా వచ్చింది. ఇప్పుడు అందరికీ అవగాహన వస్తున్నది. ధర్మం పట్ల శ్రద్ధ, ఆసక్తి పెరుగుతున్నది.

జయేంద్రసరస్వతీస్వామివారు పీఠానికి వచ్చిన కొత్తలో మహాస్వామివారు 'వ్యక్తిగతంగా సంతృప్తిగా ఉండాలి' అని చెప్పారు. జయేంద్రస్వామివారు అదే విషయాన్ని మాకూ చెప్పారు. 'అసంతుష్టో ద్విజో నష్టః సంతుష్టో క్షత్రియో హతః' ఆశ్రమవాసులూ, బ్రాహ్మణులు ఉన్నదానితో నిరాడంబరంగా, తృప్తిగా ఉండాలి. క్షత్రియులు ఏదైనా విస్తరింపజేయాలి. అందుకని రాజులు ఉన్నదానితో తృప్తి పడకూడదు. తిరుపతిలో కొండమీద జరుగుతున్న అన్నదాన పథకంలాగా క్షేత్రదర్శనం కోసం ఎక్కడికి వెళ్ళినా అక్కడ ఆహారం, ఆచారం దొరకాలి. అక్కడ అభిమానం, ఆదరణా ఉండాలి. కంచిమఠం ఆవరణలలో యాత్రికుల సౌకర్యం కోసం సంతర్పణ ఏర్పాట్లు జరుగుతున్నాయి. భగవద్గీతా వ్యాఖ్యానంలో శంకరాచార్యులవారు 'బ్రాహ్మణస్య హి రక్షితేన రక్షితః స్యాత్ వైదికో ధర్మః' బ్రాహ్మణత్వాన్ని కాపాడితే వైదిక ధర్మాన్ని, హిందూమతాన్ని కాపాడవచ్చు అని చెప్పారు. బిందువులు పెట్టుకుని వాటిని కలుపుతూ ముగ్గు ఎలా వేస్తారో అలా బ్రాహ్మణం, వేదం, గుడి వీటిని కలిపితే తద్వారా మన సంస్కృతిని, ధర్మాన్ని అభివృద్ధి చేయవచ్చు. ఉత్తరోత్తరా అఖిల భారతంలో కార్యకర్తలను సమీకరించి, వైదికధర్మం అభివృద్ధి చెందించి తద్వారా సమాజానికి సుఖశాంతులు అందించాలి. మన హిందూమతం దేశాన్ని హిందూస్థానంగా నిలబెట్టటానికి ధర్మప్రచారం అనుకూలం కావాలి. దానికి వెంకటేశ్వరస్వామి యొక్క కృప, మన స్వామివారి కృప అన్నీ ఉండాలి.

*'శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినాం ।*  
*శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళం ॥*  
*అపార కరుణాసింధుం జ్ఞానదం శాంత రూపిణం ।*  
*శ్రీచంద్రశేఖర గురుం ప్రణమామి ముదాన్వహం ॥*  
*దేవే దేహే చ దేశే చ భక్త్యారోగ్యసుఖప్రదం ।*  
*బుధ పామర సేవ్యం తం శ్రీ జయేంద్రం నమామ్యహం ॥*  
*సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం ।*  
*అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం ॥*

మన దేశంలో గురు పరంపర కొనసాగాలి. ధర్మసమాజం కోసం వంశ పరంపర కూడా కొనసాగాలి. ధర్మ పరంపర నిర్విఘ్నంగా భక్తులందరికీ శాంతి, సుభిక్షం, కలిగించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం.

***జయజయ శంకర హరహర శంకర***

*సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం ।*
*అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం ॥*



# గురుపౌర్ణమి రోజు స్వామివారి సందేశం

వేదములే మనకు మార్గదర్శకములు. భారతమే మన పవిత్రభూమి. గురువే మనకు దీపజ్యోతి. వెంకటేశ్వరుడే మనకు ధర్మప్రభువు. ఋషులే మన జీవన విధానానికి దిశానిర్దేశము. వంశపరంపర, జ్ఞానపరంపర, గురుపరంపర – ఇది మన ధ్యేయము. గురువారము వ్యాసపౌర్ణమి – గురుపౌర్ణమి. 'కృష్ణం వందే జగద్గురుమ్' అన్నట్లు జగద్గురువైన కృష్ణపరమాత్మని దగ్గర నుండీ ఎందరో మహానుభావులు యావత్‌భూఖండానికి శాంతి, భద్రత, ప్రేమ, స్నేహం, సేవలను తమ బోధనల ద్వారా అందించారు. నిరాడంబరమైన, బాధ్యత కలిగిన, ఉపకారము నిండిన జీవితాలను మనకు అందించిన మార్గదర్శకులైన భగవంతునికి, మహర్షులకి, జ్ఞానులకి, సిద్ధులకి, ధర్మపాలకు లకు, దిక్పాలకులకు, భగవన్నామ స్వరూపుడు అయిన నారదులవారికి, వాగ్దేవి సరస్వతికి, విఘ్నములు తొలగించే వినాయకునికి, దేశాన్ని కాపాడే క్షేత్రపాలకుడికి, వర్షం కురిపించే ఇంద్రుడికి, భూమిని ధారణ చేస్తున్న ఆదిశేషునికి, చతుర్వేదాలు వల్లెవేసే సృష్టికర్త అయిన బ్రహ్మకి ఈ మహాపర్వకాలంలో పూజ చేయాలి. పౌర్ణమి తిథి ఆహ్లాదానికి, అభివృద్ధికి, ఆనందానికి ప్రతీక.

గురువారంతో కూడిన ఈ గురుపౌర్ణమి రోజు భక్తులు అందరు తమతమ గురువులను స్మరిస్తూ, వారు ఇచ్చిన సందేశాలను అనుసంధానం చేస్తూ, పూజ చేసుకోవాలి. ధర్మము, సమాజము, విశ్వశాంతికి దోహదం చేస్తూ ప్రపంచ వికాసానికి భారతదేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టడానికి కృషి చేయాలి.

భూలోక వైకుంఠమైన తిరుమల క్షేత్రంలో చాతుర్మాస్యవ్రత దీక్ష చేయబోతున్నాం. ఈ విశ్వావసునామ సంవత్సరంలో మన నూతన గురువులు శ్రీసత్య చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామివారి నూతన చాతుర్మాస్యవ్రత సంకల్పము సంబరంగా జరుగనుంది. చాతుర్మాస్య పూజ అనంతరం సంకల్ప కార్యక్రమం ఉంటుంది.

'స్వామీ మీరు ఇక్కడే ఉండండి. మీకు సేవలు అందించి మేము భాగ్యాన్ని పొందుతాము అనే భక్తుల విన్నపాన్ని మన్నించి వారి తరఫున మేము చాతుర్మాస్య వ్రత సంకల్పము తీసుకొంటాము.

గురుపౌర్ణమి నుండి భాద్రపద పౌర్ణమి వరకు అనేక పారాయణములు, శాస్త్రార్థములు, హోమములు, సదస్సులు, సంగీత కచేరీలు, దేశానికి ధర్మానికి పునర్వికాసాన్ని కలిగించే కార్యక్రమాలు జరుగుతాయి. కావున భక్తులందరు చాతుర్మాస్య వైభవంలో కలుసుకొని శ్రీవేంకటేశ్వరస్వామివారి కృపాకటాక్షం పొందాలని ఆ దేవదేవుని ప్రార్థిస్తున్నాము.

*జయజయ శంకర హరహర శంకర*

# శ్రీ కామాక్షీ విలాసము



'అయోధ్యా మథురా మాయా కాశీ కాంచీ హ్యవన్తికా, పురీ ద్వారవతీ చైవ సప్తైతే మోక్ష దాయకాః.' అని చెప్పబడిన సప్తమోక్షపురములలో దక్షిణాన ఉన్న ఏకైక మోక్షపురి అయిన శ్రీకాంచిక్షేత్రములో విరాజమైన శక్తికి కామాక్షియని, కామకోటి యని ఆమె నెలవుండు ప్రదేశమునకు కామకోష్ఠమని వ్యవహారములో కనిపిస్తున్నది. అదేవిధముగా శ్రీమద్భాగవతములో 'కామకోటి పురీం కాంచీమ్' (10-79-14) అనియు మేరుతంత్రములో 'ఐకారోభూత్ కామకోటీ నాభీస్త్రత తు తే అపతత్ – తత్ర సర్వేపి సిధ్యంతి కామమంత్రా న సంశయః' అనియు ఉన్నది.

ఈ కామాక్షీ విలాసమను గ్రంథము అంతమున మార్కండేయ పురాణాంతర్గతమైనదిగ ఉటంకించ బడినది. సురథ మార్కండేయ సంవాదరూపముగా ఉన్నది. పరబ్రహ్మస్వరూపిణి అయిన కామాక్షి ఈ క్షేత్రములో మూడు శక్తి స్వరూపములగను, రెండు శివరూపములగను, ఒక విష్ణురూపముగను విరాజిల్లుతున్నదనియు, అందు కామకోష్ఠమున నెలవున్న కామాక్షి పూర్ణాంశమనియు నిరూపించు చున్నది. మరియు ఈ గ్రంథము అఖండ కాంచీమండలముగా పిలవబడు తొండైమండలపు ఎల్లలు, ముఖ్యక్షేత్రములు కంచిలో కామాక్షి రూపములని చెప్పబడిన ఆరుమూర్తుల క్షేత్రములైన పుణ్యకోటి, రుద్రకోటి, కామకోటి క్షేత్రముల యందు విరాజిల్లెడి ప్రధానమూర్తులు మరియు శివ, విష్ణు, గణేశ, కార్తికేయ, దుర్గాది మందిర స్థానములు, పరస్పర దూరములు. మహాత్మ్యములు వివరించినది. కాంచిలో ఉండెడి వివిధ శివాలయములలో శక్తికి ప్రత్యేక గర్భగృహములేని ప్రత్యేకతకు గల కారణము, ఆగమ శాస్త్రములు, శిలాశాసనములు, ప్రాచీన శైవాచార్యుల పాటలలో వివిధ క్షేత్రములలో ఉన్న కామాక్షికి భిన్నమైన శక్తులను కంచికామకోటిగ పిలుచుటకు గల కారణము ఈ గ్రంథమూలముగానే తెలియనగును. వేరెక్కడను వివరించబడినట్టు లేదు. అందువలన అనేక సంప్రదాయాలకు ఈ గ్రంథము ముఖ్యప్రమాణముగ ఉన్నది. ఈ గ్రంథ సహాయముతో దేవీ భక్తులైన తెలుగువారు కామాక్షిదేవి మహిమను తెలుసుకొని, ఆ దేవిదర్శన, ధ్యానాదుల చేత సకల శుభపరంపరను, సౌభాగ్యములను పొందగలరని ఆశిస్తున్నాము.

కాంచీపుర వైభవాన్ని తెలియజేసే రెండు ప్రధాన గ్రంథములు



ఉన్నాయి. ఒకటి శ్రీ కామాక్షీ విలాసము. రెండవది శ్రీకాంచీ మాహాత్మ్యము. కాంచీ మాహాత్మ్యము స్కాందపురాణాంతర్గతమైనది. శివ ప్రధానమైన గ్రంథము. కాంచిపురములోని శివక్షేత్రము లన్నింటినీ వివరించినది.

కామాక్షీ విలాసము పదునాలుగు అధ్యాయముల గ్రంథము. మార్కండేయ సురథ సంవాదరూపముగ ఉన్నది. దీనితోపాటు కామాక్షీ మాహాత్మ్యమును తెలిపే హయగ్రీవస్య సంవాదరూపమైన రెండు అధ్యాయముల మహాలక్ష్మీ తంత్రము కూడా కార్వేటినగర ప్రతి నుండి చేర్చబడి ఉన్నది.

కామాక్షివిలాసము కూట త్రయాత్మకమైన పంచదశీ మంత్రముతో అభిన్నమైనటువంటి మహాత్రిపురసుందరి యొక్క వాగ్భవకూటము శ్రీ కాంచీనగరమనియు, ఈ నగరము భూదేవికి నాభిస్థానము వంటిదనియు చెబుతున్నది. ఈ కాంచీనగర మధ్యనున్న కామకోష్ఠమున ఉన్న బిలద్వారము సకల జీవములకు ఉత్పత్తిస్థానమని వివరిస్తుంది. ఇంకను కాంచీక్షేత్ర ప్రమాణము, ఎల్లలు ఆ క్షేత్రములో ఏ ఏ దిక్కున ఎంతెంత దూరములో ఏయే దేవతలున్నది, ఏయే తీర్థములున్నదీ తెల్లియజేస్తున్నది.

కాంచీపుర ప్రధాన దేవత మహాత్రిపురసుందరి అయిన కామాక్షియని గ్రంథము నిరూపిస్తున్నది. దీనిలో సంశయము ఉండాల్సిన పని లేదు. భాగతము కాంచీపురాన్ని కామకోటిపురిగా అభివర్ణించింది. కామాక్షివిలాసము కామాక్షి పరదేవతయే కాంచీపురములో శివ విష్ణు శక్తి రూపము లలో ప్రకాశిస్తున్నదని చెబుతున్నది. 'త్రిధా దేవీ ద్విధా శంభు రేకో విష్ణు రితిక్రమాత్' – 'షడ్భిన్నా తత్ర కామాక్షి దివ్యలీలాను భవతః'. ఇక్కడ త్రిపుర సుందరీ రూపంలో విరాజిల్లుతున్న కామాక్షి పూర్ణాంశదేవి. ఈమె ఫాలనేత్రం నుండి ఉద్భవించిన సర్వశైవాలయేశ్వరి అయిన గౌరీ కళాత్మదేవి. ఈమె తపఃకామాక్షి అని పిలవబడుతున్నది. మహాత్రిపురసుందరి అయిన కామాక్షిదేవి ఆజ్ఞతో బ్రహ్మగారి చేత స్వర్ణంతో నిర్మింప బడి, గౌరీదేవి నుండి కళావాహనం చేయబడి, ఆరుమాసములు బ్రహ్మచేతనే పూజింపబడి, ఏకామ్రేశ్వరునితో కళ్యాణానికై ఉద్దేశించబడిన బంగారుకామాక్షి చూతలింగవల్లభ అని పిలవబడుచున్నది. ఈమె ఏకామ్రేశ్వరుని భామిని. ఈ మూడు రూపములు శక్తిరూపములు. ఏకామ్రేశ్వరుని గుడిలో ఉన్న మామిడిచెట్టు అంబిక యొక్క నిర్గుణరూపము. కామాక్షి కుచకంకణ ముద్రాంకితమైన ఏకామ్రేశ్వర సైకతలింగము. ఈ రెండూ కామాక్షి అమ్మవారి శంభు రూపములు. ఇక వరదరాజస్వామి పురుషరూపిణి అయిన కామాక్షి.

కామాక్షీ విలాసము ఈ ఆరురూపములలో ఉన్న కామాక్షుల వైభవాన్ని వివరించడానికేర్పడిన గ్రంథము. అందువలననే పురుషరూపిణి అయిన కామాక్షి – వరదరాజు వైభవముతో ఆరంభించి సుగుణ నిర్గుణ రూపాలలో ప్రకాశించే శంభు రూపమైన కామాక్షి వైభవాన్ని వివరించి పూర్ణాంశతో విరాజిల్లే కామకోటి – కామరాజపీఠ వైభవాన్ని తెలియజేస్తున్నది.

కాంచీపురంలో ఉన్న శివాలయములో ఎక్కడా మిగతా క్షేత్రములలో వలె శక్తికి ప్రత్యేక సన్నిధులు లేవు. ఈ సంప్రదాయా నికి కారణము ఏమై ఉండాలి? ఈ గ్రంథారంభంలోనే భూమండల మంతా వ్యాపించి ఉన్న కామకోటి పీఠములలో అరవైనాలుగు వేల కామకోటిపీఠములు ఉత్తమమైనవనీ, అందులో మూడు ఉత్తమోత్తమములని వివరిస్తుంది. కామకోటిపీఠం కాంచిపురంలోని కామకోష్ఠంలో ఉన్నది.

కామకోటి అనేది కాంచీపురాధిష్ఠాత్రి అయిన కామాక్షి దేవి

నామము. ఒక సందర్భంలో పూర్ణాంశ అయిన కామాక్షి కైలాసాది సకల క్షేత్రములలో శివశక్తులన్నిటినీ కామకోటి బిలంలోకి ఆకర్షించింది. బ్రహ్మగారి కోరికపై మరల ఆయా శక్తులను ఆయా రూపాలలో పునరుద్ధరించింది. అయితే మన్మథుని విజయానికి గుర్తుగా శివజిత్ క్షేత్రమైన కంచిలో మాత్రము శివాలయములలో శక్తి సన్నిధులుండవని కట్టడి చేసింది. ఈ కథ పదునాలుగవ అధ్యాయములో ఉన్నది. కాంచీపురంలో కామాక్షి చిద్రూపిగా వ్యాపించి ఉండడం కూడా కంచిలో అమ్మవారికి వేరుగా సన్నిధి లేకపోవడానికి ఒక కారణమై వుండవచ్చు.

ప్రధానంగా పూర్ణాంశ అయిన కామాక్షివైభవాన్ని వివరించడానికై ఏర్పడిన ఈ గ్రంథం ప్రసక్తానుగుణంగా అనేక మంత్రతంత్ర శాస్త్ర రహస్యాలను వివరిస్తుంది. ఉపాసనా మార్గములను వివరిస్తున్నది. కామాక్షి పరదేవతారాధకులైన శ్రీవిద్య సంప్రదాయజ్ఞులు తరచి చదివి అంబికా వైభవాన్ని అందించే అత్యున్నత గ్రంథం. ఇంకనూ కేవలము స్మరణమాత్రమున ఆయా పుణ్యతీర్థ సేవనము, క్షేత్రదర్శనముల వలన వచ్చెడి మహాద్భుత ఫలితములన్నెడి శ్లోకములిందు అనేకములున్నాయి.

కాంచీ నగరమందున్న ఈ కామాక్షి యొక్క ఆవరణలయందు ఉత్తరపు హద్దుగా తిరుపతి వెంకటేశ్వర క్షేత్రమందున్న స్వామి పుష్కరిణి, తూర్పు హద్దు మహాబలిపురమందున్న సముద్రము, దక్షిణ పినాకిని దక్షిణ సీమ, విరించిపుర సమీపమునున్న శిలాహ్రదము పశ్చిమ సీమగాను ఉన్నవి. అది ముఖ్యావరణము. ఈ ఆవరణకు లోపల రెండు ఆవరణలు. కామాక్షి యొక్క ప్రాధాన్యముతో ఈ క్షేత్రమందున్న శివ విష్ణు శక్తి గణేశ కుమారస్వామి మొదలగు వారియొక్క ఆలయస్థానములకు ఒక దానికి ఒకటి ఎంత దూరముగా వుండవలసినది చెప్పుచూ ఆయా స్థానముల యొక్క మాహాత్మ్యము కూడా చెప్పబడినది.

కామాక్షి ఆలయము నందు నిత్యపూజలు దుర్వాసునిచే రచింపబడిన సౌభాగ్య చింతామణి శాస్త్రమును అనుసరించి జరుగుచున్నవి. అక్కడ చింతామణితో 'అయోధ్యాదిషు పీఠేషు పృథివ్యాదిష్వనుక్రమాత్' అని చెప్పుట కాంచీపురము ఆకాశరూపమని విశదము చేయుచున్నది. శివస్థానములయందు చిదంబరం ఎలా ఆకాశ రూపమో అలా కామాక్షి ఆలయమందు గాయత్రి మంటపములోపల శ్రీ కామకోటి ఒక భూబిలము నందు ఆకాశరూపమున ఆవిర్భవించి పూజింపబడుచున్నది. అలాగే తపస్సు చేయుచు తపఃకామాక్షి అను ఒక మూర్తి ఒక పాదముతో నిలిచి యుండెను. అలాగే పుండ్రేక్షు పాశాంకుశ పుష్పబాణములను హస్తముల ధరించి కూర్చున్న కామాక్షిమూర్తి కలదు. మరియు ఆదిశంకర ప్రతిష్ఠతో శ్రీచక్ర యంత్ర రూపమున ఉన్న కామాక్షి, అట్లే తంజావూరు పట్టణమున హేమకామాక్షి అనియు ఉత్సవ కామాక్షి అనియు అనేక విధముల ప్రకాశించుచుండెను.

*స్వామి పుష్కరిణీ తీర్థం పూర్వ సింధుః పినాకినీ*
*శిలా హ్రదః చతుర్మధ్యం యావత్ తుండీరమండలం.*
*మధ్యే తుండీర భూవృత్తం కంపా వేగవతీ ద్వయోః,*
*తయోర్మధ్యం కామకోష్ఠమ్ కామాక్షీ తత్ర వర్తతే.*
*స ఎవ విగ్రహో దేవ్యాః మూలభూతోద్రిరాట్ భువః,*
*నాన్యోస్తి విగ్రహో దేవ్యాః కాంచ్యామ్ తన్మూలవిగ్రహః.*
*జగత్కామకళాకారం నాభిస్థానం భువః పరం,*
*పద పద్మస్య కామాక్ష్యాః మహాపీఠం ఉపాస్మహే.*
*కామకోటిస్స్మృతిః సోయం కారణాదేవ చిన్నభః,*
*యత్ర కామకృతో ధర్మో జంతునా యేన కేన వా,*
*సకృద్వాపి సుధర్మాణాం ఫలం ఫలతి కోటిషః,*
*యో జపేత్ కామకోష్ఠే అస్మిన్ మంత్రమిష్టార్థ దైవతమ్.*
*కోటివర్ణ ఫలేనైవ ముక్తి లోకం స గచ్ఛతి,*
*యో వసేత్ కామకోష్ఠే అస్మిన్ క్షణార్థం వా తదర్థకమ్.*
*ముచ్యతే సర్వ పాపేభ్యః సాక్షాత్ దేవీ నరాకృతిః,*
*గాయత్రీ మండపాధారాం భూనాభిస్థానముత్తమమ్.*
*పురుషార్థ ప్రదం శంభోఃబిలాభ్రమ్ తం నమామ్యహం,*
*యః కుర్యాత్ కామకోష్ఠస్య బిలాభ్రస్య ప్రదక్షిణమ్.*
*పద సంఖ్యా క్రమేణైవ గోగర్భజననం లభేత్,*
*విశ్వకారణ నేత్రాఢ్యాం శ్రీమత్ త్రిపుర సుందరీమ్.*
*భండకాసుర సంహర్త్రీమ్ కామాక్షీం తామహం భజే,*
*పరజన్మ దినే కాంచ్యామ్ మహాభ్యంతర మార్గతః.*
*యోర్చయేత్ తత్ర కామాక్షీం కోటి పూజా ఫలం లభేత్,*
*తత్ఫలోత్పన్న కైవల్యం సకృత్ కామాక్షి సేవయా.*
*త్రిస్థాన నిలయం దేవం త్రివిధాకారమచ్యుతం,*
*ప్రతిలింగాగ్ర సంయుక్తం భూత బంధం తమాశ్రయే.*
*య ఇదం ప్రాతరుత్థాయ స్నానకాలే పఠేన్నరః,*
*ద్వాదశ శ్లోక మాత్రేణ శ్లోకోక్తఫలమాప్నుయాత్.*

# శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి, శ్రీసత్య చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివార్ల విజయయాత్ర విశేషాలు







**తేదీ:**

**జూన్ 27, 2025**

శ్రీ తిరుచెందూర్ మురుగన్ ఆలయ అర్చకులు మరియు అధికార సిబ్బంది, అసిస్టెంట్ కమిషనర్ శ్రీ జ్ఞానశేఖరన్ నేతృత్వంలో, పూజ్యశ్రీ కాంచీ ఆచార్యులకు కుంభాభిషేకం ఆహ్వాన పత్రిక మరియు ప్రసాదాలు సమర్పించారు.









తేదీ:
జూలై 2, 2025
ఉదయం విల్లుపురంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ కుంభాభిషేకం పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారి చేతుల మీదుగా నిర్వహించబడింది.











**తేదీ: జూలై 5, 2025** పూజ్యశ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారు విల్లుపురం నుండి చెన్నై ప్రయాణంలో భాగంగా వనంపట్టు గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీ శివాలయం మరియు శ్రీ మారియమ్మ ఆలయాలను దర్శించారు. అనంతరం కొన్నగైపాళ్యం మరియు రాఘవన్‌పేట్ గ్రామాల మారియమ్మ ఆలయాలు సందర్శించి, అదే రోజున పమ్మల్‌లోని శంకర పాఠశాలకు చేరుకున్నారు. జూలై 5 వరకు శ్రీమఠం శిబిరం చెన్నైలో కొనసాగింది.









**తేదీ: జూలై 6, 2025** పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారు మరియు పూజ్యశ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారు జూలై 6న ఉదయం తండలం గ్రామానికి విచ్చేశారు. ఆచార్యులను గ్రామప్రజలు ఘనంగా స్వాగతించి, నాదస్వరంతో, పుష్పకిరీటాలు, పుష్పహారాలు, వేదఘోషతో శంకర మెట్రిక్యులేషన్ పాఠశాల వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ కామాక్షి సమేత ధరణీశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. యాగశాలలో పూజలు నిర్వహించారు. శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారు వీధులలో నగర ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా స్వామివారు గ్రామంలోని పెద్దలను, పూర్వం జరిగిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు. కాంచీపురంలో సన్యాసదీక్ష తీసుకోవడానికి ముందు స్వామివారు ఈ గ్రామాన్ని సందర్శించారు. తన బాల్యంలో స్వామివారు తండలం గ్రామ పాఠశాలలో చదువుతూ, సమీపంలోని కాకవాక్కం గ్రామానికి నడిచివెళ్లి మహాదేవ శాస్త్రిగారి వద్ద సంస్కృతం నేర్చుకునేవారు. తండ్రి మరియు గురువు అయిన శ్రీకృష్ణమూర్తిశాస్త్రిగారితో కలిసి వ్యవసాయ పనుల్లో పాలుపంచుకునేవారు.















**తేదీ: జూలై 7, 2025** అనుష్ఠానానికి అనంతరం పూజ్యశ్రీ శంకర విజయేంద్ర స్వామివారు మరియు పూజ్యశ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారు ఉదయమే సులైమేని నుండి అరణి పట్టణానికి చేరుకున్నారు. ఇది శ్రీ శివకామి సమేత సంపంగి చండీశ్వర ఆలయ క్షేత్రంగా పరిగణించబడుతుంది. తండలం గ్రామం పూజ్య స్వామివారి పూర్వాశ్రమ గ్రామమైనప్పటికీ, జన్మస్థానం అరణియే కావడం విశేషం. పూజ్య స్వామివారు జన్మించిన సమయంలో వారి తల్లి తన చెల్లెలు సహాయం తీసుకున్నట్లుగా కుటుంబ సభ్యులు గుర్తు చేసుకున్నారు. ఈ స్థలాన్ని తరువాత కుటుంబం మఠానికి దానం చేయగా, కాంచీ మహాస్వామి ఆదేశాలతో పూజ్య శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారు 1984లో ఆదిశంకరుల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ఆచార్యులిద్దరినీ మఠంలో పూర్ణకుంభంతో స్వాగతించగా, యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించబడింది. అనంతరం గోపురాలపై కలశాలతో పూజ్యశ్రీ సత్య చంద్రశేఖరేంద్ర స్వామివారు కుంభాభిషేకం నిర్వహించారు., అనంతరం ఆదిశంకరుల విగ్రహానికి మహాభిషేకం, అష్టోత్తరం, నైవేద్యం, దీపారాధన, తోటకాష్టక పారాయణం నిర్వహించబడింది. స్వామివారు అనుగ్రహ భాషణం చేయగా శిలాఫలకం ఆవిష్కరించబడింది.

తదనంతరం కాంచీ ఆచార్యులు తండలం గ్రామంలోని భజనై కోవిల్ వీధిలో గణపతి ఆలయ కుంభాభిషేకం, అనంతరం కామాక్షీ అంబా సమేత ధరణీశ్వర స్వామి ఆలయంలో కుంభాభిషేకాన్ని నిర్వహించారు. యాగశాల పూర్ణాహుతి అనంతరం కలశాలతో ధరణీశ్వర స్వామి గోపురానికి పూజ్యశ్రీ సత్య చంద్రశేఖరేంద్ర స్వామివారు కుంభాభిషేకం నిర్వహించగా, కామాక్షి అంబాళ్ గోపురానికి పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు కుంభాభిషేకం నిర్వహించారు.












**తేదీ: జూలై 10, 2025** ఆషాఢ పౌర్ణమి నాడు తిరుపతిలో విశ్వవసు నామ సంవత్సరానికి గాను వ్యాసపూజ ఘనంగా నిర్వహించబడింది. పూజా కార్యక్రమాల్లో వివిధ ప్రాంతాల వేద పండితులు, అనేకమంది భక్తులు పాల్గొన్నారు. మహాభిషేకం, పాదపూజ, అనుగ్రహభాషణంలతో ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.







**తేదీ: జూలై 14, 2025** బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ పట్నా నగరంలోని కంకర్బాఘ్‌లో ఆర్. ఝుంఝున్‌వాలా శంకర కంటి ఆసుపత్రికి శంకుస్థాపన చేశారు. ఇది రాకేష్ ఝుంఝున్‌వాలా కుటుంబం మరియు శంకర ఐ ఫౌండేషన్ (అమెరికా) ద్వారా నిర్మితమవుతోంది. ఇది పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంగా నిర్మించబడుతుంది. దీని ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు అందించబడతాయి. ఆసుపత్రి 2026 చివర నాటికి పూర్తవుతుంది.








**తేదీ: జూలై 19, 2025** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడు జూలై 19న జగద్గురు పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదం పొందారు.

ఈ సందర్భంగా జగద్గురు విజయేంద్ర సరస్వతీ స్వామివారు పూజ్యశ్రీ జయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారి యొక్క దూరదృష్టిని వివరించారు ఆయన స్థాపించిన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహావిద్యాలయం ఆధునిక విద్యను సంప్రదాయ విలువలతో మేళవించే ఆశయాన్ని కలిగి ఉందని చెప్పారు.

ప్రొఫెసర్ వేపంపాటి కుటుంబశాస్త్రిగారు మరియు ప్రొఫెసర్ వసంత్‌కుమార్‌మెహతాగారు(విసి) ముఖ్యమంత్రికి విశ్వవిద్యాలయంలో తాళపత్ర గ్రంథాల విభాగం మరియు సంప్రదాయ శిల్పశాస్త్ర పాఠశాల నిర్వహిస్తున్న ప్రాముఖ్యమైన కార్యక్రమాలను వివరించారు. వీటివల్ల ప్రాచీన భారతీయ విజ్ఞానాన్ని, లిపులను, మరియు సంప్రదాయ శిల్పకళను పరిరక్షించడంలో విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషిస్తున్నదని తెలియజేశారు.

ముఖ్యమంత్రికి శిల్పశాస్త్ర పాఠశాల విద్యార్థి చిత్రించిన శ్రీ శంకరనారాయణస్వామి చిత్రపటం మరియు శ్రీ మహాలక్ష్మి సంప్రదాయ శిల్పాన్ని బహుమతిగా అందించారు. అలాగే, ముఖ్యమంత్రిని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ విశ్వమహావిద్యాలయం సందర్శించాలని ఆహ్వానించారు.









ఈ సమావేశం ద్వారా, భారతీయ కాలాతీత సంపదను పరిరక్షిస్తూ, సంప్రదాయాన్ని ఆధునికతతో ఏకీకృతం చేయడంలో విశ్వవిద్యాలయం కృషిని ప్రధానంగా తెలియజేయడమైనది. అదేవిధంగా గో విజ్ఞాన కేంద్రం మరియు సంప్రదాయ పాఠశాల కార్యక్రమాలు కూడా ముఖ్యమంత్రి గారికి వివరించబడ్డాయి.





తేదీ: జూలై 22, 2025 చాతుర్మాస్య సందర్భంగా తిరుపతిలోని శ్రీమఠం శిబిరంలో వార్షిక వైదిక సమష్టి భిక్షావందనం ఘనంగా నిర్వహించబడింది. పూజ్యశ్రీ విజయేంద్రసరస్వతీ స్వామివారు పాదపూజలు స్వీకరించి, అనుగ్రహ భాషణం అందించి, కొంతమందిని ముద్రాధికారులుగా మరియు శీర్షక ప్రదాతలుగా ఆశీర్వదించారు. అనంతరం తీర్థ ప్రసాదం అందించి భక్తులను ఆశీర్వదించారు.








భిన్న రాష్ట్రాల నుండి వచ్చిన వివిధ శాస్త్రాల పండితులు, జగద్గురు పూజ్యశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారు మరియు పూజ్యశ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారి సమక్షంలో తిరుపతిలో నిర్వహించిన శాస్త్ర-వాక్యార్థ సదస్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జగద్గురు పూజ్యశ్రీ జయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారి 91వ జయంతి మహోత్సవాల సందర్భంగా తిరుపతి శ్రీమఠం శిబిరంలో 12/8/2025న జరిగింది.

# దేశవ్యాప్తంగా జయంతి వేడుకలు.. అయోధ్యలో కొత్త మార్గానికి పేరు



2025 ఆగస్టు 10న పూజ్యశ్రీ జయేంద్రసరస్వతి శంకరాచార్య స్వామివారి 91వ జయంతి సందర్భంగా, దేశవ్యాప్తంగా కాంచీ కామకోటి పీఠం యొక్క అన్ని అనుబంధ శాఖలలో భక్తిపూర్వకంగా, వైభవంగా జయంతి ఉత్సవాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, స్వామివారికి అయోధ్యతో ఉన్న ఆప్యాయ అనుబంధాన్ని స్మరించడానికి, అయోధ్యలోని కాంచీ కామకోటి పీఠానికి ఆనుకుని ఉన్న రహదారికి "శ్రీ కాంచీ కామకోటి పీఠం జగద్గురు శ్రీ జయేంద్ర సరస్వతి మహారాజ్ మార్గ్" అని నామకరణం చేయబడింది.





2025 ఆగస్టు 8న పవిత్రమైన పౌర్ణమి రోజు, ఆచార్యులిద్దరూ చంద్రదర్శనం చేసి
శ్రీలలితా సహస్రనామాన్ని పారాయణం చేశారు













# విశ్వరూప యాత్ర

విశ్వవాసు సంవత్సర చాతుర్మాస్య వ్రత సమాప్తి సందర్భంగా, తిరుపతి పుణ్యక్షేత్రంలోని శ్రీ కాంచీ కమకోటి మహాపాదుకా మండపం వద్ద భాద్రపద పౌర్ణిమ (7 సెప్టెంబర్ 2025) నాడు పూజ్యశ్రీ శంకరాచార్య స్వామివార్ల విశ్వరూప యాత్ర వైభవంగాహొజరిగింది

# మూకపంచశతి-ఆర్యాశతకం





- బాలాత్రిపురసుందరి చిర్రావూరి

శ్లో॥ వదనారవిందవక్షో వామాంకతటీ వశంవదీభూతా ॥
పురుషత్రితయే త్రేధా పురంధ్రిరూపా త్వం ఏవ కామాక్షి ॥ 40 ॥

**తాత్పర్యం:** ఓ కామాక్షీ దేవి! నీవే ముగ్గురు పురుషుల ముఖారవింద-వక్ష- వామాంక తటములయందు మూడువిధములుగా పరవశవై స్త్రీ రూపములు ధరించియున్నావు.

**బాలమనోజ్ఞా:** తల్లీ! కామాక్షి! సృష్టిస్థితిలయకారకులగు బ్రహ్మవిష్ణుమహేశ్వరుల యొక్క భార్యల స్థానములలో నీవే వారి మూడురూపాలను ధరించి ఉన్నావు. బ్రహ్మగారి ముఖపద్మంలో ఉండే సరస్వతీరూపాన్ని, విష్ణువు వక్షస్థలంలో ఉండే లక్ష్మి రూపాన్ని, శివుని ఎడమతొడమీద కూర్చున్న శివాని రూపాన్ని ధరించి నీవే వారికి శక్తిని అందిస్తున్నావు. ఇదంతా నీ ఇచ్ఛ చేతనే జరుగుతున్నది.

శ్లో॥ బాధాకరీం భవాబ్ధేరాధారాద్యంబుజేషు విచరంతీమ్ ॥
ఆధారీకృతకాంచీ బోధామృతవీచిమేవ విమృశామః ॥ 41 ॥

**తాత్పర్యం:** సంసార సముద్రమును నాశనము చేయు ఆధారాదికమలములలో విహరించు కాంచీనగరమును ఆధారముగా చేసుకున్న జ్ఞానామృతతరంగమునే చింతించెదము.

**బాలమనోజ్ఞా:** కామాక్షి దేవి సంసారసాగరాన్ని ఎండింపచేసేది. మూలాధార - స్వాధిష్ఠాన మొదలగు ఆరు కమలములయందు యధేచ్ఛగా విహరించునది అని అర్థము. జగత్తుకి కాంచీ నగరము ఆధారము. కాంచీ అనగా వడ్డాణము. అట్టి కాంచీనగరాన్ని తన నివాసంగా చేసుకున్నది కామాక్షి. కాంచీనగరమునందే కాక సర్వజగత్తునందునూ సంచరిస్తూ తన జ్ఞానమనే అమృతతరంగాలను వెదజల్లుతూ ఉన్నది. అట్టి ఆ కామాక్షీ తల్లి జ్ఞానామృతకెరటమునే ధ్యానించెదము.

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA


# SRI KANCHI KAMAKOTI PEETAM

Jagadguru Shankaracharya Swamigal

Shrimatam Samsthanam, Kanchipuram







JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA

## Vijaya Yatra

of Shri Kanchi Kamakoti Peetadhipati

Jagadguru Pujyashri Shankaracharya Swamigal

## Schedule

| DATE | PLACE | PLACE OF PUJA | CONTACT |
|---|---|---|---|
| Upto 9th Sep. 2025 | Tirupati | Sri Kanchi Kamakoti Peetam Paduka Mandapam, Vinayak Nagar, Tirupati | Sri Sridhar<br>Manager, Shankara Matam, Tirupati<br>Tel- 8356060998 |
| 9th- 19th Sep. 2025 | Kotha Kandriga (near Tirupati) | Yoga Ashram, Kotha Kandriga | Sri Murali Krishna 9885400077<br>Sri Siva Prasad 9030571463<br>Location |
| 20th Sept. - 5th Oct. 2025 | Rajakilpakkam, Chennai | Sri Kanchi Mahaswami Vidya Mandir | (Devi Navaratri Mahotsavam will be observed) |

www.kamakoti.org www.youtube.com/kanchimath www.facebook.com/srikamakoti www.kamakoti.tv

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

# SCSVMV



**Sri Chandrasekharendra Saraswathi Viswa Mahavidyalaya**

(Deemed to be University u/s 3 of UGC act 1956) (Accredited by NAAC with 'A' Grade)

Enathur, Kanchipuram; Website: www.kanchiuniv.ac.in

**ADMISSIONS 2025-26**

**Law Programmes**

**B.A. LL.B. (Hons.)**

**B.B.A. LL.B. (Hons.)**

**LL.B. (Hons.)**

Approved by Bar Council of India

Exclusively for Women

**Allied Health Sciences**

**B.P.T. | B.Optom.**

**B.Sc.**

Cardiac Technology

Radiology & Imaging Technology

Dialysis Technology

Merit Scholarships Available*

*T&C apply

**96290 32323 | 63749 35806**


**Applications are invited from Qualified and Experienced candidates for the following positions:**

| | |
|---|---|
| Faculty of Law | Dean, HOD |
| Faculty of Allied Health Sciences | Cardiac Technology |
| Faculty of Engineering & Technology | Candidates with a proven track record of Research and Publications |
| Faculty of Science | |
| Faculty of Commerce | |

Apply through - **https://kanchiuniv.ac.in/careersportal**

Registrar i/c

# శ్రీ కామకోటివాణి
## ప్రత్యేక సంచిక




వెల - 250 రూపాయలు
(Postage 50 రూపాయలు అదనం)

ప్రత్యేక సంచిక కోసము
సంప్రదించవలసిన వివరాలు:

**శ్రీ కంచి కామకోటి క్యాంపు**

Email ID - srikamakotivaani@gmail.com



## For Sri Kamakoti Vaani Subscription



**Bank Details:**

**Account Name:**
Sri Kamakoti Touryatrika Trust SKV
Bank: ICICI Bank
Account No.: 440705000345
IFSC Code: ICIC0004407
UPI ID – SRIKAMAKOTIVAANI@icici

**Subscription**

₹ 480 INR (India)
₹ 5000 INR
(Lifetime, for 10 years)

e-mail id - srikamakotivaani@gmail.com

Scan me!

Sri Kamakoti Vaani subscription payment gateway.

Donors may please contact:
**Prayaga Srinivas : 800 800 1335**

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA



SHRI KANCHI KAMAKOTI PEETAM
JAGADGURU SHANKARACHARYA SWAMIGAL
SHRIMATAM SAMSTHANAM
1, SALAI STREET, KANCHIPURAM, TAMILNADU - 631502 INDIA

www.kamakoti.org

fb.me/srikamakoti

youtube.com/kanchimath

twitter.com/kanchimatham

instagram.com/kanchimutt

Koo

koo @kamakoti

www.kamakoti.tv

www.kanchimuttseva.org

ESEVA PORTAL

for Online Puja Bookings & Contributions

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA



వక్రతుండ మహాకాయ సూర్యకోటి సమప్రభ ।
నిర్విఘ్నం కురు మే దేవ సర్వకార్యేషు సర్వదా ॥
అనుజ్ఞ గణపతి సన్నిధి, శ్రీ కంచి కామకోటి పీఠం కాంచీపురం.